నిబంధనలకు తిలోదకాలు

- సామాన్యులకు ఒకలా.. ధనవంతులకు మరోలా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- దర్జాగా అక్రమ నిర్మాణాలు

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరికి తోడు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జత కట్టారు.టీఎస్ బీపాస్‌ను తుంగలో తొక్కి నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు వస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. పేదలు, సామాన్యులపై ఫిర్యాదులు వస్తే ఆగ మేఘాల మీద రెండు నెలల్లో కూల్చివేస్తున్నారు. డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణాలు చేసినా ఏమీ తెలియనట్లు మిన్నకుండిపోతున్నారు. నగరంలో ప్రస్తుతం కొన్ని శాఖల అధికారుల తీరు ఈ విధంగా ఉంది.

చూసీచూడనట్లు వ్యవహారం



మహాలక్ష్మినగర్‌లో రోడ్డు ఆక్రమించి నిర్మాణం పూర్తి చేసిన ఇల్లు

అక్రమ అనుమతులు, నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అండగా నిలుస్తున్నారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వస్తే స్పందించాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చూసీ చూడన్నట్లు వ్యవహరిస్తున్నారు. అమాయకులు, సామన్యులపై కొరడా ఝులిపిస్తూ కట్టడాలు కూల్చివేస్తున్నారు. పలుకుబడి, పేరున్న వ్యక్తుల అక్రమ కట్టడాలకు స్వయంగా వీరే వత్తాసు పలుకడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు ఫిర్యాదులు వచ్చినా స్పందించకపోవడంపై పెద్ద ఎత్తున కింది నుంచి పై స్థాయి వరకు ముడుపుల బాగోతం నడిచిందని శాఖలో అందరూ చర్చించుకుంటున్నారు.

ఫిర్యాదులు చేసినా స్పందన లేదు

నిర్మాణం ప్రారంభం నుంచి పలు మార్లు కమిషనర్, జిల్లా కలెక్టర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు మా కాలనీ లెటర్ ప్యాడ్ మీద ఫిర్యాదులు చేశాం. ఫోన్, వాట్సప్ ద్వారా విన్నవించాం. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు విన్నవించాం. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరించడం సరికాదు. మేము పోరాటాలు ఆపబోము. – నారాయణ, మానవ హక్కుల సంఘం రాష్ట్ర డైరెక్టర్

సామాన్యుడి విషయంలో..

నగరంలోని 50వ డివిజన్‌లో ఓ సామాన్యుడు తనకు ఉన్న స్థలంలో నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సెట్‌బ్యాక్ వదిలి పెట్టలేదని తనకు సంబంధం లేని వ్యక్తి ప్రజావాణిలో రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై ఆఘమేఘాల టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు నానా హడావిడి చేసి కూల్చివేశారు. స్థానిక కార్పొరేటర్‌కు సామాన్యుడు డబ్బులు ఇవ్వకుండా ప్రశ్నించినందుకే కూల్చివేశారని అందరూ చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగి విషయంలో..

22వ డివిజన్ వినాయక్‌నగర్‌లోని మహాలక్ష్మీనగర్ కాలనీలో నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణం చేశారు. టీఎస్ బీపాస్ ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలంటే తన ఇంటి నిర్మాణ స్థలంలోనే ఇరువైపులా సెట్‌బ్యాక్ 5 ఫీట్లు వదలాలి. 20 ఫీట్లు ఉన్న రోడ్డులో సైతం మూడు ఫీట్లు ఆక్రమించి నిర్మాణం చేశారు. కేవలం 17 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. దీనిపై 2022, మార్చి 21న మహాలక్ష్మీనగర్ రోడ్ నం–1 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మళ్లీ వారం రోజుల వ్యవధిలో నిర్మాణం ప్రారంభించారని మార్చి 31న ఫిర్యాదు చేశారు. స్పందించకపోవడంతో గత ఏడాది ఆగస్టు 22న కలెక్టర్‌కు, కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మళ్లీ నవంబర్ 7న ఫిర్యాదు చేశారు. ఇలా పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోలేదు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ డివిజన్ ఆర్అండ్‌బీ ఈఈగా సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈఈ రమేశ్‌ను హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. సంగారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న సురేష్ బదిలీపై జిల్లాకు వచ్చారు. డిప్యూటీ ఈఈ ప్రవీణ్, ఈఈ, జేఈలు శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి ఆగ్రహం కారణంగానే..

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పనులు పూర్తి చేయలేదు. జిల్లాకు చెందిన మంత్రి కేంద్ర ప్రభుత్వ నిధులు ఒకే నియోజకవర్గంలోకి పూర్తి చేయించాలని సంబంధిత శాఖ ఈఈ రమేశ్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. పనులు చేయకపోవడంతో కేంద్రం నుంచి వచ్చిన నిధులు ల్యాప్స్ అయ్యాయి. అందుకే మంత్రి ఆగ్రహం కావడంతో పాటు బదిలీ వేటు వేసినట్లు శాఖలో చర్చించుకుంటున్నారు.

శుభాకాంక్షలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా మంత్రికి శాలువ, పుష్పగుచ్ఛం అందజేశారు.

నష్టం పరిహారాన్ని వెంటనే అందజేయాలి



ఇందల్వాయి: ఇటీవల ఈదురు గాలులతో కూడిన భారీ వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారాన్ని వెంటనే అందజేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రోజాకు సోమవారం అందజేశారు. నష్ట పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే రైతుల తరపున పోరాడతామని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు బాకారం గంగారెడ్డిలు అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయించండి

సుభాష్‌నగర్: ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయం వెంటనే ఖాళీ చేయాలని భవన యజమానులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 17 నెలలుగా కార్యాలయం అద్దె పెండింగ్‌లో ఉందని తెలిపారు. పలుమార్లు తహసీల్దార్‌ను అడగగా, సర్దుబాటు చేస్తామని చెప్పుకొచ్చారని పేర్కొన్నారు. కానీ అద్దె ఇవ్వకపోవడంతో కుటుంబంలో తగాదాలు ఏర్పడుతున్నాయన్నారు. వెంటనే కార్యాలయం ఖాళీ చేయాలని కోరారు.

ప్రస్తుత రోడ్డును విస్తరించాలని..

కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ఎన్‌హెచ్–63నే విస్తరించాలని రైతులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వరద కాలువ, రైల్వే లైన్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, పసుపు కేంద్రానికి భూమి ఇచ్చి రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డు వంటి పనులు చేపడితే ఉన్న కొద్దిపాటి భూమి కోల్పోయి సుమారు 200 మంది రైతుల కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. కావున ప్రస్తుతమున్న రోడ్డునే విస్తరించి పనులు చేపట్టాలని రైతులు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో అంతర్గత రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సీసీ రోడ్డు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. సర్పంచ్ బాలరాజ్, ఎంపీడీవో నటరాజ్, నాయకులు మహ్మద్ నజీబ్, చిన్నారెడ్డి, హనుమంతు రెడ్డి తదితరులు ఉన్నారు.

రక్త నిధి సేవలు ఆదర్శప్రాయం

- నగర మేయర్ దండు నీతూకిరణ్
- ఘనంగా హెన్రీ డునంట్ జయంతి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త నిధి సేవలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. సోమవారం రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు హెన్రీ డునంట్ జయంతి పురస్కరించుకొని జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవంగా స్థానిక రెడ్ క్రాస్ భవనంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ హెన్రీ డునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. జిల్లా రెడ్ క్రాస్ గణనీయమైన సేవలను అందిస్తూ రాష్ట్ర స్థాయిలోనే బంగారు పతకాలు అందుకొని ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలన్నారు. సంస్థ అందరికీ అందుబాటులో ఉండి విశిష్టమైన విలక్షణమైన సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలువటం గొప్ప విషయమన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, తలసేమియా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ సమిష్టిగా సమైక్యతతో రెడ్ క్రాస్ సంస్థతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ 77వ సారి రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి కరిపే రవీందర్, నిజామాబాదు డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, జూనియర్ రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న తోట రాజశేఖర్

హోటల్‌కు జరిమానా

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: సాక్షిలో ఈ నెల 7న ప్రచురితమైన బిర్యానీలో బొద్దింక అనే కథనానికి మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ అలీం, ఆర్ఐ నరేందర్‌లు ప్రత్యేకంగా కంఠేశ్వర్ ప్రాంతాల్లోని హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్‌లోని ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న ప్రాన్స్(రొయ్యలు) గడువు ముగిసిపోయాయి. దీంతో వాటిని సీజ్ చేశారు. అలాగే బొద్దింక రావడంపై అధికారులు హోటల్ నిర్వాహకులపై మండిపడ్డారు. రూ.5 వేల జరిమానా వేశారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న కారోబార్లు, సఫాయి కార్మికులు

నిజామాబాద్ సిటీ: గ్రామ పంచాయతీ కారోబార్లు, సఫాయి కార్మికుల వేతనాలు పెంచాలని, వెంటనే వారి సమస్యలు పరిష్కారించాలని కోరుతూ నిజామాబాద్ రూరల్ మండలం పాత ఎండీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కారోబార్లను, బిల్ కలెక్టర్‌లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించి కనీస వేతనం రూ.21,500 ఇవ్వాలని, జీపీలో పనిచేసే సిబ్బందికి 51 జీవో సవరించి కనీస వేతనం రూ.15,500 ఇవ్వాలని, అందరికి ఉద్యోగ భద్రత కల్పించి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే వేతనాలు జీపీ నిధుల నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. సిబ్బంది ఎవరైనా చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పుస్తకాన్ని పౌరులందరికీ ఇవ్వాలి



ధర్పల్లి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ నేతలు



జక్రాన్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు..

ధర్పల్లి/జక్రాన్‌పల్లి: భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతి పౌరుడికి ప్రభుత్వం ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ప్రకారమే దేశం నడుస్తోందని, అలాంటి పుస్తకం గురించి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం విఫలమై పోతుందన్నారు.

కడ్తా తీస్తే కఠిన చర్యలు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- పంచాయతీ బిల్లులు రావడం లేదని నందిపేట సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నందిపేట్(ఆర్మూర్): వరి ధాన్యానికి కడ్తా పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తప్పవని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హెచ్చరించారు. నందిపేటలోని రైతు వేదికలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైస్‌మిల్లర్లు కడ్తా తీస్తే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 10 వేల నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. మండలంలో పంటనష్టం సర్వే వ్యవసాయ శాఖ అధికారులు సరిగా చేయడం లేదని తన దృష్టికి వచ్చిందని అధికారులు రైతుల పక్షాన పనిచేయాలని ఏవో జ్యోత్స్న భవానిని హెచ్చరించారు.

సర్పంచులను సముదాయించిన జెడ్పీ చైర్మన్

గ్రామాభివృద్ధిలో భాగంగా తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని మండలంలోని సర్పంచులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సభను బహిష్కరిస్తామని ఆగ్రహం వ్యక్తం చేయడంతో జెడ్పీ చైర్మన్ కల్పించుకుని స్థానిక సంస్థల సమస్యలను పరిష్కరించే విధంగా తీర్మానం చేద్దామని సర్పంచులను సముదాయించారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు

నందిపేటతో పాటు ఇతర గ్రామాలలోని అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ వాకిడీ సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, కొందరు సర్పంచులు డబ్బులు తీసుకుని పర్మిషన్లు ఇస్తున్నారని ఎంపీటీసీ శ్రీనివాస్ అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జగ్గనాథ చారి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో నాగవర్ధన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు

రుద్రూర్: ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కోటగిరిలో రైస్ మిల్లులను, కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. లారీల ద్వారా కాంటా అయిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్‌లోడ్ చేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టద్దన్నారు. ఆయన వెంట బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ఉన్నారు.



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న బోధన్ ఆర్డీవో

సమాచారం..

నేడు ఉచిత కంటి శిబిరం

నిజామాబాద్‌నాగారం:నగరంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం హైదరాబాద్ గ్లోబల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగత్‌రెడ్డి, దయాకర్ రావు సోమవారం తెలిపారు. ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440354683, 9396437571 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తిర్మన్‌పల్లి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. 12 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాసుల క్యాంపు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని శుభోదయం స్కూల్‌లో దివ్యాంగులకు మంగళవారం ఉచిత బస్ పాసుల క్యాంపు ఉంటుందని ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకుని రావాలని తెలిపారు.

'కంటి' శిబిరాలు ప్రారంభం



జక్రాన్‌పల్లి: లక్ష్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ కైలాస్, ఎంపీటీసీ సభ్యురాలు గుడాల అను పాల్గొన్నారు.

చిన్నవాల్గోట్‌లో..



సిరికొండ: చిన్నవాల్గోట్‌లో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ బొబ్బిలి రాజు సోమవారం ప్రారంభించారు. సూపరింటెండెంట్ లక్ష్మీపతి, వైద్యురాలు భారతి, కారోబార్ సాయికుమార్ పాల్గొన్నారు.

నల్లవెల్లిలో..

ఇందల్వాయి: నల్లవెల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. రెండు వారాల పాటు ఉచిత కంటి వైద్య శిబిరం కొనసాగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కంటి పరీక్షల సదుపాయాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, వైస్ ఎంపీపీ అంజయ్య, ఉప సర్పంచ్ బాబు శరత్‌లు సూచించారు.

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించండి



బోధన్: ఖండ్‌గాం, సిద్ధాపూర్, బిక్నెల్లి శివారులోని మంజీర నదిలోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఇసుక మాఫియా ఆగడాలను నియంత్రించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్డీవో ఆఫీసులో, తహసీల్దార్ వరప్రసాద్‌లకు మంజీర తీర గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నదిలోంచి ట్రాక్టర్ల ద్వారా పంటల పొలాల మధ్య నుంచి తరలించి ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసి, టిప్పర్లు, భారీ వాహనాల్లో దూరప్రాంతాలకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మద్యం మత్తులో డ్రైవర్లు ఇసుక లోడ్ వాహనాలను అతి వేగంగా తీసుకెళ్తున్నందున ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారని తెలిపారు. గ్రామస్తులు నిలదీస్తే ఎదురు దాడికి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికం

సంకష్ట గణపతి హోమం



నిజామాబాద్ సిటీ: నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నున్న శుభం కరోతి కల్యాణం ఆలయంలో సోమవారం సంకష్ట చతుర్థి సందర్భంగా గణపతి హోమం చేశారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు.

మహాగణపతి ఆలయంలో..

నిజామాబాద్‌సిటీ: బోడెమ్మ చెరువు వద్ద గల మహాగణపతి దేవాలయంలో సోమవారం సంకష్ట చతుర్థి సందర్భంగా మహాగణపతిదేవునికి పంచామృతాభిషేకం, గరికపూజ, సింధూర సమర్పణ, అర్చనలు చేసి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు రాజుశర్మ, ఆలయ చైర్మన్ చిలుముల భూషణ్ చారి పాల్గొన్నారు.



లొంక క్షేత్రంలో అన్నదానం ప్రారంభం



సిరికొండ: జిల్లాలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన లొంకలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాన్ని సోమవారం ప్రారంభించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నపూజతో పాటు ఇతర పూజా కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సంతోష్, నర్సింహారెడ్డి, మారుతి, సురేష్, గంగాధర్, భూపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను బ్లాక్ మెయిల్ చేయొద్దు

ఖలీల్‌వాడి: రైస్‌మిల్లర్లు రైతులను బ్లాక్ మెయిల్ చేయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతాంగం పండించిన వరి పంట చేతికొచ్చే సమయంలో తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రైస్‌మిల్లర్లు రైతుల బాధను గ్రహించి, జిల్లా కలెక్టర్ చొరవచూపి వడ్ల గింజలు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,300	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	57,442		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	25	40	గాజరుగడ్డ	20	30
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
జిర్నిసుకాయ	50	70	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	20	40	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సింగ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్–1– ఉగ్రం–10.30
విరూపాక్ష –1.15,10.35
రామబాణం –4.30
పొన్నియిన్ సెల్వన్–2– 7.25
స్క్రీన్–2– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ– 10.30 ,10.20
పొన్నియిన్ సెల్వన్–2 –1.30
ఉగ్రం –4.40,7.25
స్క్రీన్–3 –రామబాణం–10.30,7.30,10.30
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ–1.20,4.25
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ(ఇంగ్లీష్) 3.15,6.30,9.45
స్క్రీన్–2– ఉగ్రం–10.00,4.15,10.30
రామబాణం –1.10,7.25
స్క్రీన్–3–ది కేరళ స్టోరీ(హిందీ),10.00,1.00 4.00,7.00,10.00
స్క్రీన్–4– ఇంగ్లీష్ మంజు(తెలుగు) 10.00
యాదగిరి అండ్ సన్స్–1.25
అరంగేట్రం–4.00
పొన్నియిన్ సెల్వన్–2,6.50 ,10.20
దేవి పొన్నియన్ సెల్వన్ 2
నటరాజ్ ఉగ్రం
లలితామహల్ రామబాణం
విజయ్ విరూపాక్ష